# మనీషి - మమతా

శర్మగారి ఇంట్లో డిన్నర్‌కి వెళ్ళాం సుజాతా, నేనూ.

అప్పుడప్పుడనిపిస్తూ ఉంటుంది ఆ నాడు శర్మగారి ఇంటికి వెళ్ళి ఉండకపోతే ఈ కథ అంతా జరిగిఉండేది కాదనీ, సుజాతతో పది రోజులపాటు జరిగిన ఈ కలహం ఉద్భవించి ఉండేది కాదనీ.

వెను వెంటనే అనిపిస్తుంది, ఇదంతా జరిగి ఉండక పోతే ఒక అందమైన నిజాన్ని గ్రహించి ఉండగలిగే వాడిని కాదని.. ప్రతి సంఘటనకీ రెండు రకాల ఫలితాలు ఉంటూనే ఉంటాయి మరి. మంచిరకం, చెడ్డరకం. జరిగిన దానిలో ఏ ఫలితం ఏ రకం అన్నది నా కింకా బాగా అర్థం కాలేదు... అనుభవంతో అర్థం అవుతుందను కుంటాను.

అరంభమే కొన్ని సూచనలు చేసింది. ఇలాటి సూచనలు అంతా అయిపోయాక అర్థం అవుతాయి. లేకపోతే, కథలు జరగడమెలాగ? జీవితం నడవడ మెలాగ?

సుజాత నా ఇంట్లో ఉన్నప్పుడివన్నీ ఆలోచిస్తానని కాదు. ఆమె నా కథ. ఆమె నా జీవితం. నా ఆలోచన.

ఆ రోజు శర్మ ఆఫీసుకి వచ్చి "రాత్రి డిన్నర్‌కి రావాలి!" అన్నాడు.

"ఏమిటి సంగతి?" అన్నాను.

"వెడ్డింగ్ ఆనివర్సరీ..." అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ.

అతనికి వయసంత ఉందని కాదు. బహుశా నలభై అయిదు కన్న ఎక్కువ ఉండవు. రిటైర్ అయిపోవడానికి సిద్ధపడినట్టు కనిపిస్తాడంతే.

"వండర్‌ఫుల్. శుభాకాంక్షలు!" అన్నాను.

'రాత్రి తప్పకుండా రావా'లని అన్నాడు శర్మ మళ్ళీ. పిలుపు లాంఛనం లాగా లేదు.

సామాన్యంగా అతి సన్నిహితులు తప్ప ఎవరు పిలిచినా డిన్నర్‌కి వెళ్ళే అలవాటులేదు నాకు. అంటే, పెళ్ళయాక. ఈ లాంఛనపు పిలుపులు రిగ్రెట్ చేస్తేనే మళ్ళీ మళ్ళీ వస్తూ ఉంటాయండీ! అని వాదించేది సుజాత. ఆమె ఉద్దేశం తరవాత బోధపడింది.

శర్మ మా సన్నిహితులలోని వాడుకాదు.

"కుదర దనుకుంటాను..... సుజాత బహుశః ఏదో ఏర్పాటు చేసి ఉంటుందను కుంటాను" అన్నాను.

నవ్వి, "అదేం వీల్లేదు, జగన్! మేము పిలిచిందే మిమ్మల్నీ, మరో నలుగురినీ. మీరు రాకపోతే చాలా ఆశాభంగంగా ఉంటుంది!" అన్నాడు శర్మ.

వెంటనే అంగీకరించ దలుచుకోలేదు. ఆశగా ఇంటికి ఫోన్ చేశాను.

సుజాత సదర్ బజారుకి వెళ్ళిందట.

గొప్ప పని చేసిందిలే అనుకుని, ఫోన్ పెట్టేసి, "థాంక్స్! తప్పకుండా వస్తాము!" అని చెప్పగానే అతను నాకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయాడు.

సాయంత్రందాకా పనిలోనే వుండిపోయాను. అయిదయాక ఇంటికి చేరుకున్నాను. సుజాత ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడి అప్పుడే పూర్తి చేస్తూంది.

నేను మీదికి వెళ్ళి బట్టలు మార్చుకుని డ్రాయింగ్ రూములోకి వచ్చేసరికి సుజాత టీ తెచ్చి ఇచ్చింది.

ఆ డ్యూటీ ఆమెదికాదు. నౌకరుది;

టీ తాగుతూ "ఏం నువ్వు తెచ్చావు?" అన్నాను.

"ఏం! రుచి బాగాలేదా?" అంది సుజాత.

"చాలా బాగుంది."

"మరి?"

"కారణం ఏమిటని!"

"ఫామిలీ ప్లానింగ్ ఫెయిలవడం."

నవ్వి, బోధపరచమని అడిగాను.

"ఏముంది? వంటచేసే వాడి భార్యకి నొప్పులు వచ్చాయిట. ఈ రోజుకి సెలవు."

"మరి సర్వెంట్?"

"కూరలకని వెళ్ళాడు. జనాభా పెరిగిపోయి, అవీ దొరక్క వెతుకుతున్నాడు కాబోలు!" అంది గంభీరంగా సుజాత.

శర్మ ఆహ్వానం జ్ఞాపకం వచ్చి, చెప్పాను.

"మీరు ముందరే జాగ్రత్త పడ్డారన్న మాట!" అంది సుజాత.

"నీ వంట బాగుండదని ఎవరన్నారు?"

"తినేవారు మీరు!"

"నే ననందే!"

"తినందే ఏమంటారు?" ఆలోచించి మాటలకి మళుపు తిప్పేను.

"తయారవు! ఎనిమిదికి వెళ్ళాలి..."

"నన్నడగకుండా ఎందుకు ఒప్పుకున్నారు?"

"ఫోన్ చేశాను, నువ్వు సదర్ వెళ్ళావు."

"తరవాత?"

"మరిచిపోయాను."

"ఇంతకీ ఇది ఎన్నో వార్షికోత్సవం?"

"తెలీదు ఇరవై...ఏమో!"

"ఏమి ఇద్దాము?"

నాకా ఆలోచనే రాలేదు!

"నువ్వు చెప్పు."

తల పట్టుకుని, "భగవాన్! ఏమి మనిషిని ప్రసాదించావు!" అంది నాటకీయంగా. సుజాత.

నేను టీ తాగడం ముగించి, సిగరెట్ వెలిగించాను.

"నేను వెళ్ళేదాకా కూడా ఆగకూడదా?" అంది కోపంతో సుజాత.

"అదేమిటి? నా సిగరెట్ మీద దాడి ప్రారంభించావు?"అన్నాను ఆశ్చర్యపడి.

"ఈ వ్యసనం లేని ఆడదైపుడితే మీకు తెలిసివచ్చేది!" అంది సుజాత చిరాకుగా. ట్రే తీసుకుని వెళ్ళిపోయింది.

నేను కొంచెంసేపు గార్డెన్‌లో కూర్చుని ఆలోచనల్లో కొంత కాలం గడపాను సుజాత మాటలను గురించి అట్టే పట్టించుకోలేదు.

ఎనిమిదిన్నరకి శర్మగారి ఇంటికి చేరాము. సుజాత రెండు పుష్ప గుచ్ఛాలు తెప్పించింది.

లాంఛనాలు, భోజనాలు, త్వరగానే ముగిశాయి. లాన్‌లో కూర్చుని కాఫీతాగి, సిగరెట్ వెలిగించుకుని శర్మవైపు చూపి, సిగరెట్ కావాలా? అన్నాను పాకెట్ ఇస్తూ.

"వద్దు, మానేశాను!"అన్నాడు. శర్మ రోజుకి నలభై కాల్చే వాడు. "ఎప్పటినించి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నాలుగు నెలలు కావస్తూంది... నిజానికి మీరు ఒక విధంగా దానికి కారకులు!" అన్నాడు శర్మ.

ఉత్సుకతతో, "అదేమిటి?" అన్నాను. వెంటనే సుజాత వైపు చూశాను. ఆమె మరెవరితోనో మాట్లాడడంలో పూర్తిగా నిమగ్నమై పోయింది. దగ్గరే ఉన్నా, ఆమె ఈ వివరాలన్నీ వినిపించుకొనే పరిస్థితిలో ఉన్నట్టులేదు. మౌనంగానే ఆమెని ఆశీర్వదించాను.

"మీ ఇంటికి డిన్నర్‌కి వచ్చాం, జ్ఞాపకం ఉందా? బహుశః మీ శ్రీమతి పుట్టిన రోజుకి అనుకుంటాను."

జ్ఞాపకం తెచ్చుకున్నాను.

వర్షంగా ఉంటే గదిలో కూర్చున్నాం నా సిగరెట్లూ మిగిలిన వాళ్ళవీ కలిపి ఆవతలి గదిలో కూర్చున్న ఆడవాళ్ళనందరినీ ఉక్కిరిబిక్కిరి చేశాయిట. ఇద్దరు ముగ్గురికి కళ్ళనీటి పర్యంతం అయిందట.

సుజాత ఏమీ చెప్పలేదే అని ఆశ్చర్యపడ్డాను.

"ఆ మరునాడు నాకు దగ్గు పట్టుకుంది. మా శ్రీమతి ఒకటే పోరు పెట్టింది. మళ్ళీ సిగరెట్ ముట్టనని ఒట్టు పెట్టుకున్నాను". శర్మ సంతృప్తిగా భార్యవైపు చూశాడు.

సుజాత అప్పుడే సిగరెట్టుదమ్ములాగుతున్న నావైపు చూసింది.

పరిస్థితి నా కేమీ నచ్చలేదు కాని, మరో నిమిషంలో బాతాఖానీలో పడి, అదంతా

మరిచిపోయాను.

రాత్రి ఇంటికి వెళ్ళేసరికి ఆలస్యం అయిపోయింది. కాని, సుజాత బాగ్‌లో నించి కొన్ని కాగితాలు తీసి ఇస్తూ, "పడుకోబోయేముందివి చదవండి!" అంది.

నేను పళ్ళు తోముకుని వచ్చి, సిగరెట్ ముట్టించి, కాగితాలు చూశాను. అన్నీ సిగరెట్ కాల్చడం వల్ల వచ్చే కాన్సర్ మొదలైన వ్యాధుల గురించి.

నేను చదువుతూన్నంత సేపూ సుజాత నా వైపు చూస్తూనే ఉంది.

"ఏమంటారు?" అంది.

"ఆలోచిస్తాను" అన్నాను.

నా పక్కనవచ్చి కూర్చుని, "శర్మని చూడండి! సుఖపడుతున్నాడు, ఈ దుర్గంధం ఎలా భరించేది? నా మాట వినండి! సిగరెట్ కాల్చవద్దు!" అంది, బ్రతిమాలుతూ.

"అదంత సులువు కాదు సుజాతా!" అన్నాను. సిగరెట్ కాల్చడం పూర్తిచేసి ఆష్‌ట్రేలో పడేసి, ఆమెని దగ్గిరగా తీసుకుంటూ.

"వాసన వేస్తూంది..." అంది సుజాత, మరీ దగ్గిరగా వచ్చాక.

"సారీ... ఆ ఎత్తులు సాగవు. సుజాతా! రెండు రోజులవుతూంది మనం...."

ఆమె కోపంగా లేచిపోయింది.

నేను వెళ్ళి, మళ్ళీ నోరంతా శుభ్రం చేసుకున్నాను. నోటివాసన పోయింది. సుజాత కోపమూ పోయింది.

రెండు రోజులు గడిచాయి, నా సిగరెట్ల మీద సుజాత ఉండీ ఉండీ ప్రచ్ఛన్నంగా దాడులు చేస్తూనే ఉంది. నేను అట్టే పట్టించుకోలేదు. ఆమెని ఎంత ప్రేమించినా, ఈ విషయంలో నా స్వేచ్ఛని ఆమె కోసం బలి ఇవ్వాలనిపించలేదు. గంటా, గంటన్నరా సిగరెట్ ముట్టుకోనని అనుకుని, నరాలు సలిపి. త్వరగానే ఓడిపోవడం నాకు ఇష్టం లేని పని. ఆమె అంది అని కాదు.

ఆ సాయంత్రం అమితవచ్చి ఉండకపోతే. ఈ ఉదంతం దాని కదే సమసి పోయేది అనుకుంటాను.

అమిత చాలా చక్కటి అమ్మాయి. ఎంతో తియ్యగా మాట్లాడుతుంది.

నేను గార్డెన్‌లో కూర్చుని పుస్తకం చదువుకుంటూంటే వచ్చి, "మీ శ్రీమతి లేరా?" అంది.

ఆమెని ఆహ్వానించి కూర్చోమని, "ఎక్కడికో వెళ్ళింది సుజాత. ఇంక రావాలి"

అన్నాను.

అమిత కూర్చుని, "ఏమిటీ చదువుతున్నారు?" అంది.

మూసి, కిందని పడేసిన పుస్తకం వైపు చూస్తూ, "రీడర్స్ డైజెస్టు వాళ్ళ కండెన్స్‌డ్ బుక్" అన్నాను.

"సారీ... మిమ్మల్ని డిస్టర్బ్‌చేశాను." అంది అమిత. లేవబోతూ.

"లేదు లేదు... మరేమీ చేసేది లేక పుస్తకం తీశాను. కూర్చోండి!" అన్నాను.

సందేహిస్తూనే కూర్చుంది అమిత.

చాలా అందంగా ఉంది అమిత. తెలీని ఆలోచనలు మనస్సు నంతనీ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆమె తదేకంగా నా వైపు చిరునవ్వుతో చూడడం నా బ్లడ్ ప్రెషర్నిగాని, పల్స్ రేట్‌నిగాని తగ్గించేందుకు సహాయం చెయ్యలేదు. సిగరెట్ వెలిగించాను.

"మీరు చాలా సిగరెట్స్ కాలుస్తారు!" అంది అమిత.

ఆ మాటలు చాలా తియ్యగా, బాధపడుతూన్నట్టు అంది. నాకు చాలా చిత్రమైన అనుభూతి కలిగింది. నేనేమైతే ఈమెకేం? కాని...

"ప్రమాదం లేని అలవాటు లెండి" అన్నాను.

"ప్రమాదం లేకపోవడం ఏమిటి? కాన్సర్ వస్తుందిట" అంది అమిత.

"సిగరెట్లని గురించి ఆడవాళ్ళకే ఎక్కువగా తెలుసులా ఉంది" అనుకున్నాను, సుజాత మాట అమితకి చెప్పలేదు, ఎందుకో ఆ మాట ఆ ప్రస్తుతం అనిపించింది.

సంభాషణ ఎలాగ సాగేదో కాని, సుజాత వచ్చింది. ఆమే, అమితా లోపలికి వెళ్ళిపోయారు. నాకు పుస్తకం చదవాలనిపించలేదు.

రాత్రి హఠాత్తుగా సుజాత పూర్తిగా నా మీద దాడిచేసింది.

"మీరు సిగరెట్లేనా వదులుకోవాలి..."

"లేదా" అన్నాను. నా వాక్చాతుర్యం పీకలమీదకి తెస్తూనే ఉంటుంది.

"మీకు తెలుసు..." అంది సుజాత.

"ప్రయత్నిస్తాను..." అన్నాను. ఉద్దేశం లేకపోయినా.

'రేపు ఉదయం నించి ... ఎనిమిది గంటలనించి..., మీరు సిగరెట్ మానెయ్యాలి! అంది సుజాత.

నే నేమీ అనలేదు. ఆమె నా మీద ఆప్యాయతకొద్దీ, నా మంచికోసమే చెబుతూందని తెలుసు నాకు, కాని...

చాలాసేపు ఆలోచించాను. ఏమీ తెగలేదు. ఇది ఆమె అనుకున్నంత సుళువు కాదని తెలుసు.

దీపం ఆర్పి నిద్రపోబోయాను.

ఉదయం 'ఎనిమిది గంటలు...' అని జ్ఞాపకం చేసింది సుజాత.

'చూద్దాం' అన్నాను.

'ఇంకా తొమ్మిది గంటల వ్యవధి ఉంది!' అంది సుజాత. ఆ రాత్రి మళ్ళీ సిగరెట్ కాల్చలేదు.

ఉదయం కాల్చాను.

లేచే సరికి ఎనిమిది. టీ తాగి, సిగరెట్...

సుజాత ఏమీ అనలేదు.

తొమ్మిది దాటాక. పేపరు చదువుకుంటూంటే వచ్చి "మీ కారు గరాజ్‌నించి ఎప్పుడు వస్తుంది?" అంది.

"ఎల్లుండి."

"అయితే, డీలక్స్‌లో వెడతాను."

"ఎక్కడికి?"

"ఢిల్లీ.."

"ఏమిటింత హఠాత్తుగా?"

"మీకు నోటీ సిచ్చానుగా?"

అంతా జ్ఞాపకం వచ్చింది.

"తొందరపడకు, సుజాతా!" అన్నాను. సిగరెట్ పాకెట్ మీద పేపరు పడవేస్తూ.

"మీరు సిగరెట్లు మానగానే టెలిగ్రామ్ ఇవ్వండి, వస్తాను."

"టెలిగ్రామ్ ఎందుకూ? ఫోన్ చేస్తాను..."

"సాక్ష్యానికి !"

మధ్యాహ్నం సుజాత వెళ్ళిపోయింది. నాకు ఆఫీసుకు ఫోన్ చేసి, "అమిత రేపు వెళ్ళిపోతూంది." అంది.

ఆఫీసులో పనిలో పరధ్యానంగా ఉండి. "అమిత ఎవరు?" అన్నాను.

"మీ కొత్త గర్ల్ ఫ్రెండ్! సారీ!" అంది, నవ్వుతూన్న గొంతుకతో సుజాత.

"అదేం కాదు!" అన్నాను తొందరగా.

"అందుకే. సారీ!" అంది సుజాత. "వెడుతున్నాను."

"చూడు. సుజాతా...!..."

'క్లిక్' మంది ఫోన్

చెవిలో డయల్ టోన్.

ఆ సాయంత్రం ఆఫీసునుంచి క్లబ్బుకి వెళ్ళి అక్కడే డిన్నర్ తిని, రాత్రి పదకొండు దాటుతూంటే వచ్చాను. రాగానే టెలిఫోన్. సుజాత అనుకున్నాను.

"హల్లో...!" తియ్యటి, కొత్త కంఠస్వరం.

"ఎవరు?" అన్నాను.

"జగన్‌గారా?"

"అవును."

"నేను అమితని.."

"ఓ!,,,,"

"మీకోసం చూశాను సాయంత్రం ఇంటికే రాలేదేం?"

"అలాగ క్లబ్బుకి వెళ్లి....."

"శ్రీమతిగారు లేని ఇల్లు ఇల్లులాగా లేదనుకుంటాను..."

"ఇది కొత్త కాదు లెండి!" అన్నాను. నిద్ర వస్తూంది. ఆవలింత ఆగలేదు.

"మీరు డిన్నర్‌కి వస్తా రనుకున్నాను. ఇంతదాకా చూశాను. నిద్ర వస్తూందా? బై ...." అని ఆమె ఫోన్ పెట్టేసింది.

వొస్తూన్న నిద్ర పోయింది, అమిత నాకోసం కాచుకుని ఉందా? ఎందుకని?

చాలాసేపటి తరువాత మళ్లీ నిద్ర వచ్చింది. అమిత చాలా అందంగా ఉంటుంది. ... అదే నా చివరి తలపు.

అనుకున్నట్టు వెళ్లి పోలేదు అమిత. ఏవో అనుకోని అడ్డంకులు వచ్చి, మరో పదిరోజులు ఆగ్రాలోనే ఉంటుందిట. ఆ మరునాడు సాయంత్రం వచ్చి చెప్పింది.

"పది రోజులు నన్ను భరించాలి!" అంది.

"సంతోషంగాను!" అన్నాను సిన్సియర్‌గా.

"మీరు క్లబ్బుకి వెళ్లిపోతారుగా?"

"అంత అలవాటు లేదు లెండి."

"థాంక్స్!"

గార్డెన్‌లో నాతో కూర్చుని అమిత తొమ్మిదయేదాకా కబుర్లు చెప్పింది, అంత తెలివైన అమ్మాయి కాకపోవచ్చును. అయితేనేం? ఎంత బ్యూటిఫుల్!

అమిత ఎంతో చక్కగా మాట్లాడు తుంది. ఆప్యాయత చిలుకుతూ ఉంటుంది. నాలుగైదు రోజుల్లోనే నాకు సన్నిహితురాలై పోయింది.

ఈ నాలుగైదు రోజుల్లోనూ సుజాతకి టెలిఫోన్ చేద్దామని అనుకున్నాను. కుదరలేదు. పగలంతా ఆఫీసు; సాయంత్రాలు అమితతో...

ఆదివారం మే మిద్దరం ఫతేపూర్ సిక్రీ చూడడానికి వెళ్ళాం. అమిత చూడలేదట. "నేను వెడతాను. మీ కెందుకు శ్రమ?" అని ఆమె అనకపోలేదు. కాని, నేనే బలవంతం చేశాను.

అక్కడ ఛిష్టీ సమాధి మీద దాగావేస్తూ కళ్లు మూసుకుంది అమిత.

"ఏమని కోరుకున్నారు?" అన్నాను బయటికి రాగానే.

"అది రహస్యం!" అంది అమిత.

బులంద్ దర్వాజా ఫొటోలు తీస్తూ, నాకూ తీసింది అమిత. నాకూ, కెమేరాలకీ పడదు. అయినా, నేనూ అమిత పిక్చర్ తీశాను. (తరవాత అందులో ఐదారుగులు అమితలు కనిపించారుట).

చాలాసేపు తిరిగి రెస్ట్ హౌస్‌కి వచ్చి అక్కడ ప్రసిద్ధి పొందిన ముప్ఫై రెండు పొరల పరోటా ఆర్డర్ చేసి అది తినలేక, తెచ్చుకున్న ఆహారం తిన్నాం. విశ్రాంతి తీసుకుంటూంటే, సిగరెట్ కాలుస్తున్న నన్ను లాలనగా చూస్తూ, "దాగా ఎందుకు కట్టానో తెలుసా?" అంది అమిత.

"రహస్యం అన్నారు...."

"అవును... మీరు నవ్వుతారని..."

"......?....."

"మీరు సిగరెట్లు మానాలని!"

ఒక్కసారి లేచి కూర్చున్నాను, ఆమె నా కోసం అంత మమత చూపడంలోని సంతోషమూ, నాసిగరెట్ల మీద దాడి చేసినందుకు చిరుకోపమూ ఒక్కసారి పెనవేసుకున్నాయి నన్ను.

"అమితా! మీరు..." అన్నాను. ఏమనాలో తెలియక ఆగిపోయాను. ఆమె కళ్లు ఆర్ద్రంగా, ఎర్రగా ఉన్నాయి.,

"అవునండీ!.... మీకు ఆరోగ్యం పాడవుతుందని ఎంతో భయం నాకు .... మీరు సిగరెట్టు వెలిగించినప్పుడల్లా నాకు ఒళ్ళు కాల్చినట్లు ఉంటుంది. ప్లీజ్! సిగరెట్ మానెయ్యండి!.... నా కోసం!'' అంది విచిత్రమైన స్వరంతో, అమిత. ఆ గొంతుకలో జీర...... ద్రవించి పోయాను, నటనకాని ఆమె ఆవేదనను చూసి.

నేరం చేసినట్టు బాధపడి, కాలుస్తూన్న సిగరెట్ పారవేశాను. సాయంత్రం ఇంటికి వెళ్లేదాకా మళ్లీ సిగరెట్ కాల్చలేదు. చాలా తల నొప్పిగా, సలుపుతోన్నట్టు ఉంది. అయినా సరే...

ఆ రాత్రి అమిత మా ఇంట్లోనే భోజనం చేసింది. రాత్రి ఇంటికి వెడుతూ, "సిగరెట్ వదిలేశారు కాదూ?'' అంది.

కాదనడానికి వీల్లేకుండా అంది. బ్యూటిఫుల్ వాయిస్.

తల ఊపాను.

"ఒట్టువేసి చెప్పండి!'' అంది - అందంగా చెయ్యి చాపుతూ.

ఆమె చేతిలో చెయ్యి వేశాను.

ఆమె వెళ్లాక వెంటనే నా చెయ్యి సిగరెట్ మీదకీ, లైటర్ మీదకీ వెళ్లింది కాని, మరుక్షణం వెనక్కి వచ్చేసింది. ఇంతలో మరో విషయం తెలిసింది.

'సాయంత్రం ఫోనొచ్చింది. సార్!' అన్నాడు నౌకరు.

"ఎక్కణ్ణించి?''

"ఢిల్లీనించి.''

"ఎవరు?''

"అమ్మగారు''

"....ఏమన్నారు?''

"మీకోసం అడిగారు...''

'ఏమన్నావు?''

"మీరూ అమ్మగారూ......'' వాడికి బుర్రలేదు.

"సరే, ఇంకేమన్నారు?''

"ఏమీ అనలేదండి! మొన్నా అంతే నండీ!''

"అదేమిటి?''

"అమ్మగారు ఫోన్ చేశారు. సాయంత్రం మీరూ అమ్మగారూ ఎక్కడికో వెళ్లారని

చెప్పాను."

"మంచి పనిచేశావు!" వాడికి బుద్ధి అసలులేదు.

రాత్రి బాగా నిద్ర పట్టలేదు. సిగరెట్ కోసం నరాలు గోల పెడుతున్నాయి. నా చెయ్యి అటు వెళ్ళినప్పుడల్లా అమిత చెయ్యి, ఆమె ప్రార్థనా జ్ఞాపకం వచ్చి వెనక్కి వచ్చేది.

సుజాత ఏమనుకుంటూంది? అమిత వెళ్లలేదనీ, నాతో పరిచయం ఎక్కువ చేసుకుంటూందనీ తెలిసి, కోపంగా ఉందా? ఆ కోపంలో తొందరగా వచ్చేస్తుందా? ఆలస్యం చేస్తుందా?

అమిత మనసులో ఏముంది? ఎందు కంత దగ్గరగా, అప్యాయంగా వస్తూంది?

ఆ ఆలోచనలతోనే రాత్రి అంతా గడిపాను. తెల్లవారగానే సుజాతకి ఫోన్ చేద్దామని అనుకున్నాను. కాని, ఉదయం టీ తాగగానే నిద్ర వచ్చేసింది. పదిదాకా లేవలేదు. త్వరత్వరగా ఆఫీసుకి. ఆ సాయంత్రం నా కోసం ఎదురు చూస్తూ అమిత.

'అలాగ ఉన్నారేం?' అంది ఆత్రతతో.

'ఏమీ లేదు...'

"సిగరెట్ లేకనా?"

"అవును..."

"పాపం! నాలుగు రోజుల్లో అదే అలవాటు అయిపోతుంది. నా కెంత ఆనందంగా ఉందో తెలుసా?"

నేనేమీ అనలేదు. ఆమెలో ఆప్యాయతా, ఆనందమూ ఆ సాయంత్రం వెల్లి విరిశాయి.

రాత్రి వాళ్ళ ఇంటికి డిన్నర్‌కి రమ్మంది. కాదని, క్లార్క్ షిరాజ్‌కి వెళ్లి డిన్నర్ తీసుకుని, తాజ్‌దాకా వెళ్లి, తలుపులు మూసిన సంగతి తెలుసుకుని ఇంటికి వచ్చాము. పదకొండు అయిపోయింది.

ఆమెని ఇంటి దగ్గిర దింపి, నేను వెళ్లబోయాను.

కారు కిటికిలో ఉన్న నా చేతిమీద చెయ్యి వేసి "ప్రస్తుతానికి గుడ్‌బై జగన్! రేపు ఉదయమే వెళ్లిపోతాను." అంది అమిత.

"అదేమిటి?" అన్నాను.

"అమృతసర్ వెళ్ళి నాలుగు రోజులుండాలి. టెలిగ్రామ్ వచ్చింది. మీరు బాధపడతారని ముందు చెప్పలేదు..."

"సారీ."

"నాకూ విచారంగానే ఉంది. కాని మిమ్మల్ని మరిచిపోను, నాకోసం సిగరెట్ మానేశారు.. ఎంత బాధో తెలుసు.... కాని, నా కోసం ఆ త్యాగం చేశారు! ఏం?"

"అవును..."

"మరిచిపోకండి!"

నా వేళ్లు ఒక్కసారి నొక్కి అమిత త్వరత్వరగా వెళ్లి పోయింది. నేను ఇంటికి చేరుకున్నాను. సాయంత్రం సుజాత టెలిఫోన్ చేసిందిట.

ముందర సుజాతకి టెలిగ్రామ్ ఇవ్వాలనిపించలేదు. క్రమ క్రమంగా నా ఆలోచనల్లో అమిత కన్న సుజాత ఎక్కువగా రావడం జరిగినా, ఓడిపోవడం అంత సులువుగా అంగీకరించాలనిపించ లేదు నాకు.

అలాగే టెలిఫోన్ కూడా చెయ్యకుండా నాలుగు రోజులు గడిపాను. కాని, ప్రతి గంటా ఆమెకోసం నా కోరికని హెచ్చు చేస్తోంది. చివరికి ఆమెకి టెలిగ్రామ్ ఇచ్చేందుకు నిర్ణయించుకుని ఇంటికి వచ్చాను. ఆ సాయంత్రం టెలిఫోన్... సుజాత...

"ఇంట్లో ఉన్నారేం?"

'ఏమీ తోచక!' అన్నాను.

'ఏం?"

"నువ్వులేక..."

నవ్వు - వెక్కిరిస్తూన్నట్టు.

"అమిత ఉండగా?"

"అమిత..." అని నిజం చెప్పబోయి ఆగి, "ఉన్నా, నీ ఉండడంవేరు!" అన్నాను.

"నిజంగా?"

"అవును..."

"సిగరెట్లు జాగ్రత్తగా కాలుస్తున్నారా?"

"లేదు."

"నిజం?" మామూలుగా అంది సుజాత. ఆమెలో ఉత్సాహం లేదు. సంతోషంలేదు.

"ఆ! నిజం!"

"రేపు వచ్చి చూస్తాను."

హృదయం ఒక్కసారి గెంతువేసింది.

"చూడు!" అన్నాను జాగ్రత్తగా. సుజాత ఫోన్ పెట్టేసింది.

సంభాషణ అయిపోయింది. నేనే జయించానన్న ఇందాకటి సంతృప్తిలో, నాకు బోధపడని ఏదో లోపం క్రమంగా తెలిసి రాసాగింది. కాని, సుజాత కోసం ఎదురు చూడడంలో అది నన్నంతగా బాధ పెట్టలేదు.

రాత్రి ఎనిమిదయాక చేరింది సుజాత. ఎండకి భయపడి, నాలుగు దాటాక వాళ్ళ నాన్నగారి కారులో బయలుదేరిందిట.

స్నానం చేసి, ఆమె వచ్చేసరికి బాగా చీకటి పడింది.

నాకెదురుగా సోఫాలో కూర్చుని, "అయితే, సిగరెట్లు మానేశారా?" అంది గంభీరంగా సుజాత.

"అవును!" అన్నాను.

"ఎందుకని?" అంది సుజాత.

"నువ్వు వస్తావని..... నువ్వు చెప్పావుగా!"

చిత్రంగా చూసింది సుజాత.

"అమిత ఎప్పుడు వెళ్ళింది?"

"నాలుగు రోజులైంది... నీ కెలాగ తెలుసు?"

"అమృతసర్ వెడుతూ కనిపించింది."

"అసంభవం!"

"మరి?"

"నాకు తెలీదు..."

"ఫతేపూర్ సిక్రీ ఫోటో లేవీ?"

ఆశ్చర్యంగా చూశాను.

"అమిత మీకు తీసినవి."

తేరిపారి చూస్తూ ఉండిపోయాను.

"సిగరెట్లెందుకు మానేశారు? అమిత కోసమేనా?"

అబద్ధం పనిచేసేలాగ లేదు.

నిజం వేరే పని చేసేలాగ ఉంది.

"సుజాతా!".... అన్నాను. గొంతు పూడిపోయినట్టుంది.

"అమితకి చేతిలో చెయ్యి వేసి వాగ్దానం చేశారు - కాదూ?"

"నీ కెలాగ తెలుసు?"

వచ్చి నా పక్కనకూర్చుంది సుజాత. తనసామీప్యంతో, తన పరిమళాలతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూ. మా ఇద్దరి మధ్యా అమిత.

"నా కన్నీ తెలుసు..." అంది సుజాత.

"సారీ...! నువ్వు వెళ్ళిపోయి ఉండ వలసింది కాదు." అన్నాను

సుజాత హఠాత్తుగా లేచి లోపలికి వెళ్లింది. ఏం జరిగింది? నిమిషంలో ఆమె వచ్చింది. చేతిలో సిగరెట్ పేకెట్, లైటర్ ఇచ్చి మళ్లీ నా దగ్గర కూర్చుని, సిగరెట్ పాకెట్ విప్పి ఇస్తూ "తీసుకోండి!" అంది.

ఆశ్చర్యపడ్డాను. ఈమె నన్ను పరీక్షిస్తూందా?

"వద్దు!"

"తీసుకోండి!" అంది నా కళ్ళనించి తన కళ్ళని తిప్పకుండా, రెప్పవెయ్యకుండా.

"సుజాతా!"

"తీసుకోండి - ప్లీజ్ !"

తీసుకున్నాను. ఆమె వెలిగించింది.

ఒళ్లు జివ్వుమంటూన్నది. అరికాలి నించి నెత్తిమీదదాకా రక్త ప్రసార వేగం తెలిసి వస్తూన్నది.

అమె నా కళ్ళలోకి చూస్తూనే ఉంది.

'ఏమిటి సుజాతా!" అన్నాను, సగం కాల్చిన సిగరెట్ ఆష్ ట్రే మీద పెట్టి. "ఎందుకిలాగ?"

లేచి నిలబడి, నా వెనక్కి వెళ్ళి మెడ చుట్టూ చేతులు వేసి, "నేను సుజాతని.... మీరు జగన్ అందుకు!" అంది.

చాలాసేపు నేను కదలలేదు. ఆష్ట్రేలో సిగరెట్ నుసి అయిపోయింది. మరొకటి యాంత్రికంగా వెలిగించి. నేరం చేసినట్టు సుజాత వైపు చూశాను. ఆమె సంతృప్తిగా నవ్వుతోంది.

కష్టంతో కళ్లు తిప్పుకుని సిగరెట్ తీసుకున్నాను. నాకు బోధపడింది. అవును... ఆమె సుజాత.... నాది.

✧ ✧ ✧